# ఈవారం కథ

నాకు చిన్నప్పటి నుంచి భక్తి కొంచెం ఎక్కువే. శనివారాలు, ఉపవాసాలు, పండగరోజుల్లో ఉద్రేకంగా పూజలు చేయడాలు ఉండేవి. ఆధ్యాత్మిక చింతన పెంచుకునే మార్గాన నడవాలనే తపనతో భక్తిని ఆసరాగా తీసుకునేవాడివి.

నా స్వభావం మెతకదేం కాదు. ఉద్రేకంగా ఎప్పుడూ ప్రతిస్పందించేవాడిని. గట్టిగా వాదించడం, అంత నిశ్శబ్దంగానూ గంటల తరబడి ఎవరితో మాట్లాడకుండా నా ఆలోచనల్లో నేను ఉండడం అందరికీ అలవాటైన విషయమే. కానీ ప్రపంచంలో మనుషులు ఎదుటవారి లోపాల్ని క్షమించి గుణాల్ని మెచ్చుకునే రోజనేది బహుశా రాదేమో! నాకు అవహేళన అనేక రూపాలలో ఎదురయేది. నా నమ్మకాలను, అలవాట్లను బాగా గేలి చేసేవారు. నేను చదివేది స్కూలు ఫైనలే అయినా మాట్లాడే విషయాలు అంతకు మించి ఉండడం కారణమేమో!




ఆ రోజుల్లో నాకు వున్న ఒక 'దుష్ట' స్నేహితుడు ధూమకేతు. నాకున్న విలువలతో తూచి చూస్తూ 'వాడు దుష్టుడు' అనే అనుకునేవాణ్ణి. మహా ఉత్సాహవంతుడు. విపరీతంగా అల్లరి చేసేవాడు. అది నాకు తలనొప్పిని కలిగించేది. నేను ఎంతో ఓర్పుగా సర్దుకుపోతుండేవాడిని. అవును, అది వాడి స్వభావం. స్వభావాన్ని వ్యతిరేకించి, మనిషిని మారమనడం ఎంతవరకు సమంజసం?

ప్రాణాంతకమైన వాడి అల్లరిలో నాకు తెలియకుండానే పాల్గొనవలసివచ్చేది. తనేదైనా చెయ్యగలిగితే అది ఇంక ఎవ్వరూ చెయ్యలేరని వాడి ప్రగాఢ నమ్మకం – పైగా అదే అభిప్రాయంతో తీవ్రంగా ఎద్దేవా చేసేవాడు.

ఒకసారి చెట్టు ఎక్కుదామని ఇంకొకడితో ఉద్యమించాడు. చాలా దూరమే ఎక్కారు. ఆ తర్వాత వీడికి ఒక ఆలోచన వచ్చినట్టుంది – దాంతో రెండోవాడ్ని అక్కణ్ణుంచి దూకమన్నాడు. దూకేటప్పుడు కిందకు పడుతుంటే శరీరం గాలిలో తేలిపోతూ భలే సరదాగా వుంటుందన్నాడు. అసలు కిందపడినా శరీరానికి ఏం దెబ్బలు తగలవు, అంతా మనమనుకోవడంలో వుంది అని రెచ్చగొట్టి ఆ పిల్లాడు దూకేంత వరకు తీసుకెళ్ళాడు. వాడు దూకాడు. కాళ్ళు విరిగాయి. నెల్లాళ్ళు మంచం మీద నుంచి లేవలేదు. ధూమకేతులో ఇసుమంతైనా బాధలేదు. నాకు మహాభయం వేసింది. ఇలాంటి వాడితో నాకు స్నేహం ఏమిటి అని ఎన్నిసార్లో ప్రశ్నించుకున్నాను. కానీ ఏదో ఇంకో రకమైన భయమే నన్ను వాడితో స్నేహాన్ని తెంచుకోనివ్వలేదు. వాడికీ నేనంటే తెలియని భయం, ఆదరం వుండేవనుకుంట. అందుకే ఎగతాళి ఎగతాళిగానే జరుగుతూ వుండేది. మా ఊరు నేను వదిలిపోయేంతవరకూ వాడూ, నేనూ కలిసే తిరిగాం.

నేను సన్యాసం తీసుకుని ఊరు వదిలిపెట్టేశాను. అనేక ప్రాంతాలు తిరిగాను. ధర్మార్థ కామ మోక్షాలు గురించి విన్నాను, చూశాను. ధ్యానంలో వున్న గొప్ప మహిమను కనుక్కున్నాను. ప్రపంచంలో జరిగే పెద్ద పెద్ద సంఘటనల వెనుక వుండే చిన్న చిన్న సత్యాలను గ్రహించగలిగాను. కొంత ఉదాత్తతను సంపాదించుకోగలిగాను. కొంత మంది శిష్యులను కూడా.

మళ్ళీ మా ఊరు రావడం వల్ల ధూమకేతు గురించి ఇన్ని ఆలోచనలు. వాడు ఇప్పుడు ఎక్కడున్నాడు? ఏం చేస్తున్నాడు? నేను ఇన్నాళ్ళూ వాడ్ని కలిసే ప్రయత్నం చెయ్యలేదు.

* * *

నాకు స్కూల్ ఫైనల్ చదివే రోజులలో ఒక స్వామీజీతో పరిచయం ఏర్పడింది. మా ఊరికి ఆయన తన శిష్యబృందంతో రావడం, నేను ఆయన పట్ల తీవ్రంగా ఆకర్షితుడవడం చాలా కొద్దికాలంలో విచిత్రంగా జరిగిపోయింది. మా ఇంట్లో ముందు ఎటువంటి వ్యతిరేకత కలిగింది కాదు. భక్తిని ఎప్పుడూ దుర్వ్యసనంగా భావించడం మనకు తెలీదు. అందుకే అన్నయ్యలు, అమ్మ, అక్కయ్య ఆయన దర్శనం చేసుకుని పాదాలని స్పృశించి ఆశీర్వాదాలు తీసుకున్నారు. స్వామీజీ రెండు మూడు పదాలలో నా గుణాల్ని మెచ్చుకున్నట్లుగా అమ్మతో అన్నారు. అమ్మ పొంగిపోయింది. మా అందరితో ధూమకేతు కూడా వచ్చాడు. అంతసేపు స్థిరంగా వాడు కూచుంటాడని నేను అనుకోలేదు. వాడిలో పెద్ద మార్పు రాబోతోందేమో అనుకున్నాను.

ప్రతిరోజు ఉదయం నేను స్వామీజీతో కలిసి ధర్మ సంబంధమైన విషయాలు తెలుసుకుంటుండేవాడిని. అంటే ముక్తి, మోక్షం ఇంకా చాలా చాలా. ఈ మాటలు చాలావరకు నేను అక్కడా ఇక్కడా విన్నవి. స్వామీజీ చెప్పేది కొంతవరకు అర్థమయేది, మరికొంత అర్థమయినట్లు అనిపించేది కానీ గుర్తుండేది కాదు. ఎవరికైనా చెబుదామంటే మాటలు తొణికేవి కావు. నాకు ఆ మాటలు వినడం వలన కలిగే ఆనందం, అవి ఇతరులకు చెప్పాలన్న ఉద్రేకంలో కొట్టుకుపోయేది. అలాంటప్పుడే ధూమకేతు ఆటపట్టించేవాడు.

* * *

స్వామీజీ వచ్చి కొద్ది రోజులైంది. నాలుగైదు రోజులలో బయలుదేరి వెళ్ళిపోతారు. అది విన్న నాకు తెలియని బెంగ పట్టుకుంది. నా ఆలోచనల్లో నేనుండగా ధూమకేతు వచ్చి వీపు మీద చరిచాడు.

"నీకో గొప్ప సరదా గురించి చెబుతాను, ఇలా రా" అన్నాడు. వాడికి నచ్చిన ప్రతి విషయం ముందూ 'గొప్ప' అని చేరుస్తాడు.

"నాకస్సలు కదలాలని లేదు నువ్వు వెళ్ళు" అన్నాను నెమ్మదిగా.

"ఏం నాయనా ఈ రోజేమైంది. స్కూల్ ఫైనల్ పరీక్షకు ఇంకా పూజ మొదలుపెట్టలేదా? అయినా ఎందుకు, ఆ స్వామీజీ వున్నాడన్నావుగా. ఆయన కాళ్ళ మీద పడు. మార్కులు అవే వచ్చేస్తాయి".

నేను వాడి సరదాలను ఇష్టపడకపోయినా వాడి మనసు కష్టపడేలా ఒక్క మాట అనను కదా! వాడు ఎందుకు ఇలా అంటాడు – నాకు కొన్ని ప్రశ్నలకు సమాధానాలు ఎప్పుడూ దొరికేవి కావు.

"సరే నా చదువు గురించి, ఆ స్వామీజీ గురించి నీ నోటితో వినాల్సిన ఖర్మేం పట్టలేదు. అయినా ఎందుకొచ్చావో చెప్పు, ఏదో గొప్ప సరదా అంటున్నావుగా" అన్నాను.

వాడు కొంచెంసేపు నావైపు చూసి మెల్లిగా జేబులోంచి బీడీ తీశాడు ఏమీ మాట్లాడకుండా నా దగ్గిర కాల్చడం మొదలుపెట్టాడు. నేను ఎలా కంగారుపడతానో చూడాలని వాడి తాపత్రయం. నాకు ఆశ్చర్యమేసినా పెద్దగా చూపించకుండా–

"ఇదేనా గొప్ప సరదా!" అన్నాను ఎగతాళిగా.

"నువ్వే చూడు తెలుస్తుంది" అన్నాడు.

నాలో మొండి ధైర్యం, ఒక విధమైన చికాకు, వాదించలేని అశక్తత తలబిరుసుతనం ఒక్కసారి ఆవహించగా చేతిలోకి తీసుకుని ఆ 'గొప్ప' సరదాను తీర్చుకున్నాను. ఏదోలా అనిపించింది. ఒక అరగంట క్రితం నా ఆలోచనలకు నేను ఇప్పుడు చేస్తున్న పనులకు ఏవీ పొంతన లేదు. ఎందుకని? స్వామీజీ నా ఎదురుగా నిలబడితే నేను ఏం సమాధానం చెప్తాను? నన్ను ఆయన క్షమిస్తారా? ఇంత చిన్న విషయానికి లొంగిపోతే నేను ఇంకా పెద్ద విషయాలు ఎలా తెలుసుకొంటాను.

ఒక్కసారి ఏడుపు ముంచుకొచ్చింది. భోరుమన్నాను. ధూమకేతు కొంచెం తడబడ్డాడు. అయినా వాడి సహజమైన ధోరణిలో,

"ఛీ తేరా నువ్వేం మొగాడివి? ప్రతిదానికి ఆడపిల్లలా ముక్కు ఎర్రబడిపోతుంది. ఏం, పది రోజుల నుంచి మీ స్వామీజీ దగ్గర నుంచి నేర్చుకున్న ధైర్యం, జ్ఞానం ఇదేనా? అందరూ దొంగ సన్నాసుల్రా! నువు పిచ్చాడివి" అన్నాడు.

నా ఉద్రేకం తగ్గలేదు. వాడికి నేను దూరమై స్వామీజీ చుట్టూ తిరుగుతున్నానని వాడికి అసూయ. లేకపోతే ఎందుకు అన్నిసార్లు స్వామీజీని తిడతాడు! నేను నా చిన్న బుర్రలో అర్థం చేసుకున్న విషయం అది.

నాకు ఆ క్షణంలో ధూమకేతు నుంచి చాలా దూరం పారిపోయి వాడిని జన్మలో చూడకూడదనిపించింది.

నేను అంత చిన్న వయసులో సన్యాసం తీసుకుంటాననడం పెద్ద గొడవ రేపింది. అమ్మ భోరుమంది. ఎన్నో విధాల చెప్పి ప్రయత్నించారు. స్వామీజీ గంభీరంగా కష్టనిష్ఠూరాలు విప్పి చెప్పాడు. అన్నిటికీ నేను సిద్ధమే అన్నాను. నాకు సరియైన మార్గం ఇదే అని అందరికీ చెప్పి మొండిగా వచ్చేశాను.

నా నిర్ణయానికి పూర్తిగా ధూమకేతు కారణం అని అనను. కానీ వాడి తీరుతెన్నులు చాలావరకు నన్ను ముందుకు తోశాయి.

* * *

ఇప్పడెక్కడున్నాడు?

మా మఠంలో వున్న స్వాములలో నేను ప్రముఖుణ్ణి. అలాంటి పేరు సంపాదించుకున్నాను. ఎన్నో ఊళ్ళు, వాడలు తిరిగింతర్వాత అప్పడప్పుడు చివుక్కుమనిపించే సంఘటనలు జరక్కపోలేదు. ఎంత పోగొట్టుకున్నాను అని ఆలోచించడం మానేసి చాలా కాలమైంది. మళ్ళీ ఇటు రాగలిగాను.

మా ఇంట్లోని అందరు సభ్యులు వచ్చి నా దర్శనం చేసుకుని వెళ్ళారు. ఇప్పుడు నా ముఖంలో వాళ్ళకేదో తేజస్సు కనిపిస్తుందిట. అవునా? నాకు నవ్వు వచ్చింది.

ధూమకేతు రాడే? వాడిని పలకరించకపోతే ఎలా? మా కుటుంబం నుంచి తెలిసినదేమిటంటే వాడు ఏదో చిన్న ఉద్యోగం మీద పక్కనే వున్న పెద్ద ఊళ్ళో వున్నాడని.

ఆ పూట ఉదయం చెరువు ఒడ్డున ధ్యానం చేసుకుని కళ్ళు తెరిస్తే, ధూమకేతు!

ఎంతో పాడయిపోయి, వట్టి పీనుగులా కనిపించాడు. రెండు చేతులు జోడించి కాళ్ళకి నమస్కరించాడు. చాలా మారాడనిపించింది. కళ్ళనీళ్ళు పెట్టలేదు కానీ గంభీరంగా వున్నాడు.

"నువ్వు మునుపటి కంటే ఎంతో తేజస్సుతో వెలుగుతున్నావు" అన్నాడు. అది చాలా మంది అన్నా ధూమకేతు అనడం బాగుందనిపించింది. ఒక చిత్రమైన గర్వం మనసులో మెదిలి మాయమైంది. "నాకు కష్టాల నుండి విముక్తి కలిగే మార్గం ఏదైనా చెప్పు, సన్యాసం తీసుకోనా?"

ఒక్క నిమిషం ఆగి – "చచ్చిపోవాలనిపిస్తుంది" అన్నాడు దీనంగా. నేను ఎలా మొదలుపెట్టాలో తెలీక ఒక క్షణం మాట్లాడకుండా వుండిపోయాను.

ఒక స్వామీజీలా అందరికీ చెప్పే విషయాలు ధూమకేతుకి చెప్పలేను, చెప్పకూడదు. అవి అతని తలకెక్కవు. పైగా ధూమకేతులోని 'దుష్ట' స్నేహితుడు నాతో ఎప్పుడూ వున్నాడు. అతడ్ని స్నేహితుడుగానే ఆదరించాలి గానీ, శిష్యుడిగా కాదు.

చేతులు రెండూ తీసుకుని, "ధూమకేతు, నేను జీవితంలో ఎంత పోగొట్టుకున్నానో, నీకేం తెలుసు? నీకు దొరకనివి నాకు దొరికిన మాట నిజమే! కానీ వాటిని పొందడానికి నేనెన్ని త్యాగాలు చెయ్యవలసి వచ్చింది? కొద్దిపాటి సహనంతో నువ్వూ పొందవచ్చు. చావు దేనికీ సమాధానం కాదు. ఆ విధంగా ఆలోచిస్తే ఊరు విడిచిన ఒకటి, రెండు సంవత్సరాలలో శవాన్నై వుండేవాణ్ణి. నన్ను నా కోరికలే ఇంత దూరం తెచ్చాయి. నీకు కోరికలు చచ్చిపోయినంత వైరాగ్యం కలిగిందంటే నేను నమ్మను. కదూ!"

ధూమకేతు నమ్మలేనట్టు విన్నాడు.

నాకూ కష్టాలు వున్నాయని చెప్పడం నా స్నేహితుడ్ని నిలబెట్టడానికి చాలా అవసరమనిపించింది.

"అయితే ఈ ప్రశాంతత, ఈ చిరునవ్వులు, ఈ తృప్తి అంతా నాటకమా?"

"అలా అని నేను అనను. కానీ కొన్ని బ్రతికే విధానంలో భాగాలైపోతాయి. 'అవి' మనమైపోతాం. మనమే 'అవి' అని ప్రజలకనిపిస్తుంది. నీకు నన్ను చూస్తే ప్రశాంతత, నిష్కల్మషం అవీ గుర్తుకువచ్చాయి. నాలో అవి వున్నాయో, లేవో ఒక్కసారి తేల్చుకోలేని స్థితిలో వుంటాను" అన్నాను.

ధూమకేతు లేచి నిలబడ్డాడు.

"అయితే సన్యాసం కానీ, చావుకానీ సమాధానం కాదంటావు"

"అవును"

కొంచెం దూరం వెళ్ళి ధూమకేతు పక్కనున్న వ్యక్తితో,

"సన్యాసుల్ని దొంగలని ఎందుకంటారో ఇప్పుడర్థమైంది. ఇంక జన్మలో ఎవడినీ కలవను" అన్నాడు.

ఇక ధూమకేతుని నేనూ కలవాల్సి రాదు. నాలాంటి స్వామిని ఒక్కసారి కలిస్తేవాడు మారతాడని నాకు తెలుసు.

బహుశా వాడి కళ్ళల్లో నేను దుష్టస్నేహితుణ్ణి!